# టపా రాలేదు బొట్టుచెరగలేదు



రన్నర్ మువ్వల చప్పుడు చేసుకుంటూ టపా తీసుకుని వూళ్ళోకి రాగానే జనం కూడా వెంటనే అతని వెంట పోస్ట్‌మాస్టర్ కిష్టయ్య గారింటికొస్తారు. కిష్టయ్య గారు ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా వుంటూ పోస్ట్ మాస్టర్ గిరీ కూడా నిర్వహిస్తున్నాడు.

కిష్టయ్య గారి వయస్సు యాభై అయిదు. చిన్నప్పుడే తండ్రి పోయాడు. తల్లి యెంత పోరుపెట్టినా పెళ్ళి మాత్రం చేసుకోలేదు. "వంశం నిలపడం కోసం కాకపోయినా వండిపెట్టడానికైనా తోడుండాలిరా!" అని ఎంత మొత్తుకున్నా విన్పించుకోలేదు. ఆ దిగులుతోనే ఆమె మంచానపడి కిష్టయ్యగారి నలభయ్యో యేట పరమపదించింది. పోయిన తల్లికి తర్పణాలు విడిచాడు కాని పెళ్ళిమాట తలపెట్టలేదు.

పదిరోజులపాటు మండని పొయ్యితో అవస్తపడుతూ ఇంత అన్నం ఉడకేసుకుంటే, ఇంత కూర, చారు ఎవరైనా పంపించేవారు. పందకొండో రోజున కిష్టయ్యగారు పొయ్యి రాజేస్తుండగా బాబుగారూ! మీరు లేవండి. నే

వండిపెడతాను అంటూ సోదెమ్మగారు వచ్చింది. వంటిల్లు విడిచి వరండాలో కొచ్చాడు కిష్టయ్యగారు. ఆనాటినుంచీ సోదెమ్మ గారే ఇంత వండి వార్చి తనూ ఓ ముద్ద తింటోంది!

సోదెమ్మ గారికీ దాదాపు నలభై ఏళ్ళున్నాయి. చిన్నప్పుడెప్పుడో పెళ్ళయి భర్త పోగా, గాజులు కుంకంబొట్టు అసలు గుర్తు లేకపోగా, అటువారు ఇటువారు అంతా వెళ్ళిపోగా నిర్లిప్తంగా తిరుగుతూంటుంది. ఎవరితోనూ మాట్లాడదు. ఆ ముఖంలో దైన్యంకాని, దుఃఖం కాని ఉందందామా అదీ తెలియదు. ఎవరింట్లో ఏపని ఉన్నా వెళ్ళి చేసి పెట్టడం, తన కిష్టమైన ఇంట్లో ఇంత ముద్ద తినటం, పదిహేనేళ్ళనుండి కిష్టయ్యగారికి వండి పెడ్తున్నా అందరిళ్ళలోనూ సాయం చేస్తూనే ఉంది. కిష్టయ్యగారు సోదెమ్మ గారు కూడా ఎప్పుడూ మాట్లాడుకోరు.

"బాబుగారూ! భోజనం వడ్డించా" అంటుంది సోదెమ్మ.

భోజన మయ్యాక "చింతకాయ పప్పుబాగుంది సోదెమ్మగారూ" అంటూ చెయ్యి కడుక్కుంటాడు కిష్టయ్య.

తనకిది కావాలని ఈయన అడగడు. ఆవిడ కనుక్కోదు. అలా సాగిపోతూ యాభై ఐదోయేట పడ్డారు ఇద్దరూ.

రన్నర్ తపాలా సంచీ ఇవ్వడమేమిటి, వాకిట్లో జనం కలకలం. కిష్టయ్య ఉత్తరాలు సర్దుకుంటూ ఒకే ఒక దినపత్రికని వాకిట్లోకి విసిరేశాడు. దాని చుట్టూ మూగారు జనం. ఒకాయన పాటపాడినట్లు వార్తలు చదువుతూంటే ఆ వార్తలకనుగుణంగా సంతోష ఆశ్చర్య విభ్రమాల్ని ప్రకటిస్తున్నారు కొందరు.

కిష్టయ్యగారు కొందరికి ఉత్తరాలు రాసిపెట్టి మనియార్డర్లు పూర్తి చేసిపెట్టి మళ్ళీ తపాలాసంచీ సర్ది రన్నర్ కిచ్చేసి వాకిట్లోకి వచ్చారు.

ఆయనే పోస్టు జవాను కూడా.

చేతిలో సర్దిన ఉత్తరాలు.

"సుబ్బయ్యా ఇవ్వాళ నీకు కార్డు లేదయ్యా, రంగయ్యా! మీ అబ్బాయి

రేపొస్తున్నాట్ట ఇదిగో .... బూశమ్మా నీ కొడుకు పదిరూపాయలు పంపించాడు. ఇక్కడ వేలిముద్ర వెయ్యి... " అంటూ అక్కడి జనాన్ని పంపించేసి వీధిలో కొచ్చాడు.

వెంకయ్య ఇంటిముందు అరుగుమీద కూర్చుని "వెంకయ్యా! పంచదార తీసుకురావోయ్!"

"చెప్పండి విషయం" అంటూ వెంకయ్య రాగా ముందు పంచదార పెట్టించుకుని "నీకు మనవడు పుట్టాడయ్యా" అంటూ కార్డు చేతికిచ్చాడు. వెంకయ్య ముఖం వెలిగిపోయింది. కిష్టయ్యగారికి మరింత ఆనందమైంది.

పక్క వీధిలోకొచ్చి "వెంకాయమ్మా! నువ్వేం కంగారుపడకు. నీ కూతురికి జ్వరంగా ఉందిట. ఈ రోజుల్లో జ్వరాలేం చేస్తాయి" అని ధైర్యం చెప్తూ ఉత్తరం చదివి "రేపు పథ్యం పెట్టే ఉత్తరం తీసుకొస్తాగా" అని హామీ ఇచ్చి ఇంకో వీధిలో కెళ్ళాడు. అలా అన్ని వీధులూ తిరిగి ఉత్తరాలిస్తూ అందరి ఆనందం పంచుకుంటూ, కష్టాల్లో ఉన్నవాళ్ళని సముదాయిస్తూ, ఓదారుస్తూ గూడెం దగ్గరకొచ్చాడు.

కిష్టయ్యగారొచ్చే వేళకి మరియమ్మ చెట్టు దగ్గర నుంచుని రోజూ ఎదురుచూస్తూ ఉంటుంది. మిలట్రీలో ఉన్న భర్తనించి ఉత్తరం కోసం ఉత్తరం వస్తే కార్డు గాలిలో ఎగరేసుకుంటూ వస్తాడు కిష్టయ్యగారు. లేకపోతే మరియమ్మని కూర్చోపెట్టి తనూ కూర్చొని "డేవిడ్ నిన్ను కావాలని చేసుకున్నాడు. మర్చిపోడు! నమ్ము! సైన్యం అంటే సామాన్యమా? తీరికుండదు. రేవు చర్చికి వెళ్ళు. సోమవారానికి ఉత్తరం వస్తుంది" అని నచ్చచెప్పి బయలుదేర్తాడు.

అలా వూరందరికీ ఆత్మ బంధువైన కిష్టయ్యగార్ని రాత్రి ఎనిమిది గంటలకి నోటుబిళ్ళ కావాలని లేపినా విసుక్కోక బిళ్ళ ఇచ్చి "అప్పులు చేసి పాడవకండ్రా" అని హితోపదేశం చేస్తాడు.

శుక్రవారం ఉదయం సోదెమ్మగారు స్నానం చేసి దేవుడికి దణ్ణం పెడ్తుంటే కిష్టయ్యగారి మనసు కలుక్కుమంది. 'ఇంతమందికీ ఓదార్పు మాటలు

చెప్తున్నాను. ఈవిడకి నేనేం చెయ్యలేపోతినే`అనుకున్నాడు. ``సోదెమ్మగారూ!'
అని పిలిస్తే ఆవిడొచ్చి నుంచుంది.

" మీ ముఖానికి బొట్టుంటే ఎలా ఉండునో!`` అన్నాడు కిష్టయ్యగారు.

సోదెమ్మ నిర్వేదంగా నవ్వనూ లేదు. చేతుల్లో ముఖం కప్పుకోనూ లేదు. ఆమెలో ఏ చలనమూ లేదు.

"మీకు నేను బొట్టు పెడ్తాను``అన్నాడు కిష్టయ్యగారు.

``బాబుగారూ! బొట్టున్నా లేకపోయినా నేను నేనే కదా" అంది సోదెమ్మగారు.

"అది నా కోరిక. మీరు కాదనకండి`` అంటూ దేవుడిదగ్గర కుంకం తీసుకొచ్చి సోదెమ్మ నుదుట అద్దాడు. ఆవిడ ముఖం వెలిగిపోతున్నట్లనిపించింది కిష్టయ్యగారికి. కాని సోదెమ్మ మాత్రం ఎలా వచ్చిందో అలాగే ఇంట్లోకెళ్ళి వంటపని చేసుకొంది.

మర్నాడు ఉత్తరాల కొచ్చిన జనానికి కిష్టయ్యగారు చెప్పాడు "నేను సోదెమ్మగారికి బొట్టుపెట్టానయ్యా అని. ఎవరూ ఇదేం విడ్డూరం అనలేదు. వ్యంగ్యంగా నవ్వలేదు. మనసార సంతోషించారు. కళ్ళలో నీళ్ళు తిరగ్గా భక్తితో ఆయన్ని చూశారు.

బొట్టయితే పెట్టుకు తిరుగుతూందే కాని సోదెమ్మ గారిలో ఏ మార్పూ లేదు. కిష్టయ్యగారూ అంతే. ఒక రోజు కిష్టయ్యగారు హఠాత్తుగా పోయారు. వూరు వూరంతా గొల్లుమంది. సోదెమ్మగారు అలాగే ఉంది. శోకంలేని ఆ ముఖాన్ని చూస్తుంటే జనానికి కళ్ళు చెరువులై పోతున్నాయి. ఘనంగా అంత్యక్రియలు చేశారు.

మర్నాడు రన్నర్ టపా తీసుకు రాలేదు.

వూరందర్నీ ఓదార్చిన కిష్టయ్యగారికి కృతజ్ఞత చెప్పుకునేందుకన్నట్టు సోదెమ్మగార్ని ఓదార్చటానికి జనమంతా. వూరేగింపుగా వచ్చారు. ఎంత కష్టమొచ్చె! అయ్యో! అయ్యో!`` అని తలా ఒకమాట.

సోదెమ్మగారిలో ఏ చలనమూ లేదు.

కిష్టయ్యగారి మంచం పక్కన మామూలుగానే కూర్చుంది.

ముఖంపైన బొట్టుమాత్రం చెరపలేదు.*